# నిరంజనుడు

నడుస్తున్నవాడల్లా శ్రీపతి ఎందుకో ఎదురుగా కనిపించిన గడియారాల కొట్టులోకి చూచాడు. గోడకు వేలాడుతూన్న గడియారం అయిదున్న గంటల కాలాన్ని సూచిస్తోంది. బీరువాల్లోనూ బల్లలమీద గోడలమీద ఒరల్లోనూ రకరకాలయిన కాలాన్ని సూచిస్తున్నాయి. కాని అవన్నీ ప్రాణం లేనివి కద! ఎవరయినా వచ్చి వాటికి వెలయిచ్చి తీసుకుపోతే కాని వాటికి ప్రాణం రాదు. అంతదాకా అవి సరయిన కాలాన్ని చూపవలసిన అవసరం లేదు. అవును మరి! డబ్బుతోనే ప్రాణం వస్తుంది. వాటికి కూడా అందరు మనుషుల లాగానే! అయితే డబ్బుతో కూడా వాటి ప్రాణం పోతుందా? ఏమో?

శ్రీపతి నడుస్తూనే వున్నాడు. ఎదురుగా ఎన్నో జట్కాలు. రిక్షాలు వస్తున్నాయి. వాటిని తప్పుకుంటూ మెల్లిగా పేవ్‌మెంట్ మీదకు చేరుకుని నింపాదిగా నడుస్తున్నాడు. ఇంత సేపూ పార్కులో కూర్చుని వస్తున్నాడు. ఇప్పుడు ఎక్కడకు వెళ్ళాలో తోచడం లేదు. ఇంటికా? వెళ్లబుద్ధి కావడం లేదు. అప్పుడే ఇంటికి వెళ్లి ఏం చేసేట్టు? మరి ఎక్కడికి వెళ్ళాలి? మనసుకేమీ తోచడం లేదు. ప్రయత్నించి మరీ నడుస్తున్నాడు. నీరసంగా వున్న శరీరం తూలుతున్నట్లవుతోంది. సైడు కాలువలో పడకుండా మాత్రం జాగ్రత్తగా నడుస్తున్నాడు. ఇంతకూ అప్పుడే ఇంటికి వెళ్ళాలనిపించడం లేదు. ఎటు ఎటో తిరగాలనిపిస్తోంది. మళ్ళీ ఏమీ పనిలేదు. ఊరికే ఊరంతా చుట్టి రావాలనిపిస్తోంది. తోచినంత వరకూ సూటిగా తిరగడం తప్ప మరో దారి లేనట్లు అనిపిస్తోంది.

శ్రీపతి ఎందుకిట్లా అనాలోచితంగా అనవసరంగా తిరుగుతున్నాడో అతనికే తెలియదు. ఈ విషయం అతనికి లోగడ చాలాసార్లు ఆలోచనకు వచ్చింది. అయితే జవాబు మాత్రం తేలిగ్గా దొరికేట్టు లేదు. యాత్రికుడిలాగ మహా మాంత్రికుడిలాగ,

గొప్ప వ్యాపకం వున్నట్లు రోడ్లంటా ఎందుకట్లా తిరుగడం? ఎందుకోసమో తెలియదు గానీ, అట్లాగే తిరగాలనిపిస్తుంది. ఈ రకంగా తిరగడంలో ఏదో అమితానందం ఉన్నట్లు అనిపిస్తుంది! అంతే.

ఎరిగిన వాళ్ళంటూ ఈ ఊళ్ళో ఎవరూ మిగిలి లేరు. అందరూ ఉద్యోగాలమీద వ్యాపారాల మీద దూర ప్రాంతాలకు వెళ్ళిపోయారు. తను వొక్కడు మాత్రం నిరుద్యోగం మీద నిర్వ్యాపారం మీద ఇంక ఈ ఊళ్ళో ఉండిపోయాడు. తనకు కూడా అప్పుడప్పుడూ ఎక్కడికయినా దూరదేశానికి వెళ్లిపోదామనిపిస్తుంది. కాని ఎక్కడికి? ఎక్కడికి వెళ్లినా చేసేపని ఏమీ లేనప్పుడు, ఇక్కడే వుంటే హాయిగ్గా ఉండవచ్చును గదా! కాని హాయి- హాయి- ఏదీ, అదే దూరం అయిపోయింది. ఎందుకు ఎట్లా దూరమయి పోయిందో తెలియదు!

ఏ రోడ్డుమీద వెళ్ళినా ఎందరో హడావుడిగా, దాదాపు పరుగెత్తుతున్నట్లుగా వెళుతూ ఉంటారు. ఎక్కడికి? అందరూ తనలాగానే ఏమీ పనిలేకుండా, ఏమితోచక వెళుతున్నవాళ్లేనా? కాదనిపిస్తుంది. అందరికీ చేతుల్లో ఏవో కాయితాలు, పుస్తకాలు, సంచులు బరువులు బాధ్యతలు! వాటి భారానికి లొంగిపోతూ, లొంగిపోవటం ఇష్టం లేనట్లు ఎక్కడకో పరుగెత్తుతూ వుంటారు అనిపిస్తుంది తనకు!

ఆలోచిస్తు నడుస్తూ ఉండగా ఎదురుగా ఎరిగిన ముఖం వస్తోంది. ఎవరదీ? గుర్తురాకముందే అతగాడు పలకరించాడు.

'ఏమోయ్, శ్రీపతి! ఏం చేస్తున్నావు? ఏమీ తోచక ఈ రోడ్డు చివరి దాకా నడుద్దామని బయలుదేరాను'.

ఓరినీ! నీ హ్యూమర్ ఇంకాపోలేదన్నమాట! అది కాదోయ్ ఇప్పుడు ఏం ఉద్యోగం చేస్తున్నావు-ఏమిటి కథ?

'ఉద్యోగం ఏమీలేదు-ఖాళీగానే ఉన్నాను'.

శ్రీపతి మామూలుగా జవాబు చెప్పాడు కాని అవతల మనిషి ఎవరో అతనికి గుర్తు రాలేదు. ఇంకా జ్ఞాపకం చేసుకుందుకు ప్రయత్నిస్తూనే ఉన్నాడు.

"భలేవాడివే! ఎక్కడబడితే అక్కడ ఉద్యోగాలు కొల్లలుగా పడివుంటే, ఖాళీగా కూర్చున్నావా? అన్నట్లు పెళ్లీ అదీ అయిందా - పిల్లలా?"

శ్రీపతికి నవ్వు వచ్చింది. ఈ మనిషి ఎవరో తనకు బాగా పరిచయమయినవాడే అయివుండాలి!

"లేదు-ఇంకా చేసుకోలేదు".

'ఉద్యోగం చేయటం లేదు, ఇంకా వివాహమూ చేసుకోలేదు. అయితే ఏం చేస్తున్నావోయ్, ఇన్నాళ్ళూ శ్రీపతి!" అన్నాడు. బుజం మీద చేయితో చరిచి.

"ఏమీ తోచడం లేదు. అదే ఆలోచిస్తున్నా? తోచక హుహ్ ఆలోచించట మెందుకూ? ఏదో ఒకటి చేసెయ్యక? అన్నట్లు మన వాళ్ళు అంతా ఎక్కడున్నారు?"

"ఎవరు?"

మన ఫ్రెండ్సు, రామలింగం, వెంకట్రావు, రత్నం, రజని అంటూ ఆ మిత్రుడు పది, పన్నెండు పేర్ల జాబితా చదివాడు.

"ఎవళ్ళూ ఇక్కడ లేరు. అంతా ఏవేవో పన్లమీద దూర దేశ ప్రాంతాలకు, గ్రామాలకు వెళ్ళిపోయారు. ఇక్కడ మిగిలిపోయిన వాడి నల్లా నేనొక్కడినే? వెనుక బడిపోయినట్లు నే నీ పరుగు పందెంలో ఇక్కడే వుండి పోయాను".

"దానికేంలే! నీ కేదో ఇక్కడే పెద్ద ఇంటరెస్టు ఉండి వుంటుంది. అందుకనే ఇక్కడే వుండి పోయావ్. నువ్వు మాత్రం సామాన్యుడివా - నేనెరగనూ?" అన్నాడు మిత్రుడు!

శ్రీపతికి, అనుమానం వేసింది. తన ఆలోచనలన్ని తారుమారు చేస్తున్నాడా ఏమిటి, ఈ మిత్రుడు!

"రా, కాస్త కాఫీ తాగుదాం" అన్నాడు.

"కాదు, నేను ఇప్పుడే తాగి వస్తున్నాను. నాకు కాఫీ తాగాలని లేదు". అందామనిపించింది శ్రీపతికి. కాని ఎందుకనాలి? ఏ మాటయినా స్వంతంగా అనడానికి తనకు స్వాతంత్ర్యం ఉన్నట్లు రూఢి లేదు. అందుకని కిక్కురు మనకుండా మిత్రుడి వెనక నడిచాడు.

హోటల్లో గడియారం గంట కొట్టింది. మిత్రుడు దిగాగ్గా "అబ్బ అప్పుడే ఆరున్నర అయింది! దీం దుంపతెగ! ఒక్కపనీ అనుకున్నట్లు అవడం లేదోయ్. ఒట్టి ప్రయాస మాత్రం మిగులుతోంది. ఈ రోజల్లా వేస్టు అయిపోయినట్లే లెక్క" అన్నాడు.

శ్రీపతికి, తనకు ఈ రోజే కాదు, ప్రతిరోజూ వేస్టేమో ననిపించింది. అసలు తనే వేస్టేమోననే అనుమానం అప్పుడప్పుడూ కలుగుతూనే వుంటుంది. కాని ఈ ప్రపంచంలో ఏదీ వృధా కాదు. ప్రతిదానికి ఏదో ప్రయోజనం వుండేవుంటుందని ధర్మసూత్రం చిన్నప్పటి నుంచి వొంట బట్టింది! అందుకనే ఇన్ని ఆలోచనలు. అంతులేని ఆలోచనలు.

అయితే తనకూ, ఈ ఎరిగీ ఎరగని మిత్రుడికీ తేడా ఏమిటి? ఇద్దరికీ ఈ రోజు వృధా అయిపోయింది! మిత్రుడికి అదే విచారం. కాని తనకు అన్ని విచారాలు తనకు ఉన్న వన్నీ విచారాలే! అంతకంటే మరేమీ లేదు.

అయిదు నిమిషాలు పోయాక మిత్రుడు వెళ్లివస్తానంటూ సెలవు పుచ్చుకున్నాడు. శ్రీపతి సరే నన్నాడు. ఇంతకూ ఈ మిత్రుడు ఎవరో, తనకు ఎట్లా తెలుసును ఏం చేస్తున్నాడో అతనికి గుర్తు రానే లేదు. అయితే, అడుగుదామనయినా ఎందుకు తెలియలేదు? ఎందుకు తోచలేదు తనకు? తోచలేదా! నిజంగా? తోచింది, కాని అనవసరం అని ఊరుకున్నాడు. తెలుసుకుని తను చేసేదేమీ ఉండదని ఊరుకున్నాడు. అప్పుడు అట్లా చేస్తేనే బాగుంటుందని తోచింది. అందుకనే అంతకంటే ఇంకేమీ చేయకుండా, మిత్రుడు అడిగిన ప్రశ్నలకు చూచాయగా జవాబులు చెప్పి తేలికగా ఇవతలపడ్డాడు. నిజానికి అతగాడు ఎవరయితే తనకు ఒరిగిందేమిటి? తనకు మరొకళ్ల ప్రయోజనం ఏమిటి కనుక? ఉన్న విచారాలు చాలక కొత్త విచారాలు ఎందుకు అంటగట్టుకోవాలి? అందుచేతే తన ప్రవర్తన ఇలా అయింధి కదా!

ఒకసారి చుట్టూ కలయ జూచుకుంటే శ్రీపతికి అప్పటికప్పుడే చాలా చీకటి పడిందనిపించింది. చీకటి పడింది! ఈ రోజు అయిపోయింది. మళ్లీ తెల్లవారితే కొత్త రోజు! కొత్త తారీఖు. కాని తన కేమిటి కొత్త? తను మామూలు మనిషే కదా! పైగా ఏమీ తోచక అటూ ఇటూ తిరగాడటమే కదా తనకు మిగిలింది? చీకటిపడినా, తెల్లవారినా తన కేమీ విచారం లేదు. ఏ స్థితీ తన గతిని మార్చలేదు. అందుకనే ఈ హుందా శ్రీపతికి.

ఇంకా చీకటిపడి ఇంటికి వెడితే ఆమెగారు కోప్పడుతుందని ఇక ఇంటికి వెళ్ళే ప్రయత్నం కొనసాగిస్తే బాగుంటుందని స్ఫురించింది శ్రీపతికి. వెంటనే తిరుగు ప్రయాణం కట్టాడు. వెనక్కు తిరిగి నడవ నారంభించాడు. కొంత సేపటికి ఇంటికి చేరుకున్నాడు. తన గదిలోనికి జొరబడబోతుండగా ఆమెగారు లోపలనుంచి వస్తూ 'ఎక్కడికి వెళ్ళావురా, ఇంతసేపూ నీకోసం శేఖరం, సత్యం ఇంకా నలుగురయిదుగురు వచ్చి ఇప్పుడిప్పుడే ఇళ్లకు వెళ్ళిపోయారు. అయినా ఇంత రాత్రిదాక ఎక్కడ వున్నావు?'

శ్రీపతి 'అమ్మయ్య' అనుకున్నాడు.

'అందుకనే ఇంత రాత్రి దాక ఇంటిదగ్గర ఉండకుండా అటూ ఇటూ తిరిగి వచ్చాను. మళ్ళీ తెల్లవారే దాకా దిగులు లేదు వాళ్ళకు' అన్నాడు నిగ్గరగా.

◆